రిపోర్టబుల్

భారత సర్వోన్నత న్యాయస్థానం

క్రిమినల్ అప్పీల్లేట్ జ్యూరిస్డిక్షన్

క్రిమినల్ అప్పీల్ నెం. 1308/2023

(ఎస్ ఎల్ పి (క్రిమినల్) నెం. 3686/2021 నుండి ఉత్పన్నమైనది)

ప్రకాష్ అగర్వాల్

.....అప్పీలుదారు

వర్సెస్

గణేష్ బెంజోప్లాస్ట్ లిమిటెడ్ మరియు మరొకరు

.....ప్రతివాదులు

తో

క్రిమినల్ అప్పీల్ నెం. /2023

(ఎస్ ఎల్ పి (క్రిమినల్) నెం. 4094/2021 నుండి ఉత్పన్నమైనది)

క్రిమినల్ అప్పీల్ నెంబర్స్. /2023

(ఎస్ ఎల్ పి (క్రిమినల్) నెంబర్స్. 3707-3708/2021 ల నుండి ఉత్పన్నమైనది)

తీర్పు

గౌరవ న్యాయమూర్తి బి. ఆర్. గవాయి:

1. అనుమతి ఇవ్వడమైనది.

2. తేదీ 22 మార్చి 2017 న ముంబై లోని అంధేరిలో ఉన్న రైల్వే మొబైల్ కోర్టు, మెట్రోపాలిటన్ మేజిస్ట్రేట్ (ఇక నుండి "విచారణ కోర్టు" అని పిలవబడుతుంది) అప్పీలుదారులకు సమనులు జారీ చేస్తూ ఇచ్చిన ఉత్తర్వులను రద్దు చేయమని అడుగుతూ దాఖలు చేసిన క్రిమినల్ రిట్ దరఖాస్తు నెం. 348, 349 మరియు 357/2020 లను కొట్టివేస్తూ తేదీ 26.04.2021 న బాంబే హైకోర్టు జారీ చేసిన తీర్పు మరియు ఉత్తర్వులను ప్రస్తుత అప్పీల్ లు సవాలు చేస్తున్నవి. తేదీ 2017 మార్చి 22 నాటి ఉత్తర్వు ద్వారా ఫిర్యాదుదారు/మొదటి ప్రతివాది దాఖలు చేసిన రిట్ దరఖాస్తు నెంబర్లు 127, 128, 129 మరియు 130/2021 లను హైకోర్టు ఆమోదించడం వలన తేదీ మార్చి 22, 2017 నాటి ఉత్తర్వులను ఆమోదించడమైనది.

3. ప్రస్తుత అప్పీళ్ళకు దారి తీసిన వాస్తవాలు క్లుప్తంగా ఈ క్రింది విధంగా ఉన్నాయి:

3.1. మొట్టమొదటి ఫిర్యాదుదారు మరియు ప్రస్తుత మొదటి ప్రతివాది అయిన గణేష్ బెంజోప్లాస్ట్ లిమిటెడ్, మొదటి నిందితుడైన మోర్గాన్ సెక్యూరిటీస్ అండ్ క్రెడిట్స్ ప్రైవేట్ లిమిటెడ్ నుండి తేదీ 14.02.2000 మరియు తేదీ 07.03.2000 ల తారీఖులలో

రెండు ఇంటర్ కార్పొరేట్ డిపాజిట్ (ఇక నుండి "ఐసిడి" అని పిలవబడుతుంది) సౌకర్యాలను పొందడం జరిగింది. ఐసీడీ ఒక్కొక్కటి రూ. 50,00,000 ల (విలువ) కలిగి సం. 2000 మే 15 మరియు సం. 2000 జూన్ 5 నాటికి తిరిగి చెల్లించబడవలసి ఉన్నది. ఈ ఐసిడి ప్రకారం, ఐసిడి మొత్తానికి 200% పూచీకత్తు కవరేజీని నిర్వహించాల్సి ఉంటుంది. తదనుగుణంగా, ఫిర్యాదుదారుడు/మొదటి ప్రతివాది ఒక్కొక్క షేరు రూ. 16/- ల విలువ కలిగి మొత్తం రూ. 2,40,00,000/- లు కలిగిన 15,00,000 ఈక్విటీ షేర్లను పూచీకత్తుగా చూపిస్తూ మొదటి నిందితుడు అయిన కంపనీ పేరిట కుదువ పత్రము (లెటర్ ఆఫ్ ప్లెడ్జ్ (సంక్షిప్తంగా ఎల్ ఓ పి)) వ్రాయడం జరిగింది.

3.2. మొదటి నిందితుడైన కంపెనీ డైరెక్టర్లు అయిన ప్రస్తుత అప్పీలుదారులు, ప్రకాష్ అగర్వాల్, మీరా గోయల్ మరియు సురేష్ చంద్ గోయల్, ఆ కంపెనీ రోజువారీ నిర్వహణకు బాధ్యులుగా ఉండినారు. వారిని మొట్టమొదటి ఫిర్యాదులో 2 నుండి 4 వ ముద్దాయిలుగా చూపడం జరిగింది.

3.3. ఆర్థిక మార్కెట్లో మాంద్యం కారణంగా, తనఖా పెట్టబడిన షేర్ల విలువ రూ.1,24,50,000/- లకు తగ్గినదని, దాని ఫలితంగా ఒప్పుకున్న పూచీకత్తు కవరేజీ ఐసిడి మొత్తానికి 200% నకు రూ. 75,50,000/-ల తగ్గుదల ఉన్నదని, అందువలన అదనంగా షేర్లను తాకట్టు పెట్టాలని అడుగుతూ తేదీ 03.05.2000 న ఫిర్యాదుదారుడు/మొదటి ప్రతివాదికి నిందితుడు నెం. 1 కంపెనీ నోటీసు జారీ చేసింది.

3.4. ఆర్థిక ఇబ్బందుల వలన, ఐ సి డి మొత్తానికి తిరిగి కట్టవలసిన తేదీ 05.06.2000 నాటికి, ఫిర్యాదుదారుడు/మొదటి ప్రతివాది, దానిని చెల్లించే పరిస్థితిలో లేనందు వలన, అతడు నిందితుడు నెంబర్ 1 కంపెనీకి తాను తనఖా పెట్టిన షేర్లను అమ్మివేసి వచ్చిన మొత్తంలో నుండి మిగిలిన డబ్బును ఫిర్యాదుదారుడు/మొదటి ప్రతివాది తనకు జమ చేయమని కోరడం జరిగినది. దాని మీదట తాము షేర్లను అమ్మి మిగిలిన మొత్తం ఏమైనా ఉంటే ఫిర్యాదుదారుడు/మొదటి ప్రతివాదికి జమ చేస్తామని మొదటి నిందితుడి కంపెనీ హామీ ఇవ్వడం జరిగినది.

3.5. తేదీ 2000 ఆగస్టు 25 న, ఫిర్యాదుదారుడు/మొదటి ప్రతివాది, మొదటి ఐ. సి. డి. ని తిరిగి చెల్లించడం, ఆ రుణ ఖాతాను ముగించడం జరిగింది.

3.6. 2001 ఆగస్టు 6 వరకు నిందితుడు నంబర్ 1 కంపెనీ క్రమం తప్పకుండా ఐ. సి. డి. పై వడ్డీని వసూలు చేస్తోందనే విషయం గమనించదగినది. ఇంతలో, ఫిర్యాదుదారుడు/మొదటి ప్రతివాది, షేర్ల అమ్మకం వివరాలను కోరుతూ, నిందితుడు నెంబరు 1 కంపెనీతో నిరంతరం సంప్రదింపులు జరుపుతున్నారు. అయితే, ఐసిడిపై వడ్డీ విషయంతో షేర్ల అమ్మకం సమస్యను (కలిపి) గందరగోళానికి గురి చేయవద్దని ఫిర్యాదుదారు/మొదటి ప్రతివాది తో అంటూ నిందితుడు నంబర్ 1 కంపెనీ ఈ అభ్యర్థనలను తిరస్కరించడం జరిగింది.

3.7. తనఖా ఉంచిన షేర్ల విలువ రూ. 44,25,000/- లకు పడిపోయిందని, అందువలన రూ. 50,00,000/-ల ఐసిడి మొత్తాన్ని తిరిగి చెల్లించాలని, లేకపోతే తనఖా ఉంచిన షేర్లను

అమ్మివేస్తామని తెలుపుతూ 2001 ఆగస్టు 2 న, నిందితుడు నెంబరు 1 కంపెనీ ఫిర్యాదుదారుడు/ప్రతివాది నెంబరు 1 కు నోటీసు జారీ చేయడం జరిగినది.

3.8. తర్వాత, 2001 ఆగస్టు 14 న ఫిర్యాదుదారుడు/మొదటి ప్రతివాది తాను రూ. 25,00,000/-లను మొదటి వాయిదాగా చెల్లించి తక్కిన మొత్తాన్ని, ఐదు సమాన నెలవారీ వాయిదాలలో, చెల్లిస్తానని మొదటి వాయిదా మొత్తాన్ని 2001 ఆగస్టు 25 న చెల్లిస్తానని చెప్పడం జరిగినది. కానీ, అదే రోజున, నిందితుడు నెంబరు 1 కంపెనీ ఐసిడి ఒప్పందంలోని ఆర్బిట్రేషన్ నిబంధనను అమలు చేస్తూ, ఏకైక ఆర్బిట్రేటర్ ను నియమించి, ఫిర్యాదుదారుడు/మొదటి ప్రతివాది నుండి రావలసిన బకాయి మొత్తాన్ని క్లెయిమ్ చేయడం జరిగినది.

3.9. ఆర్బిట్రేషన్ కార్యకలాపాలు జరుగుతూ ఉండగానే, 2004 వ సంవత్సరంలో నిందితుడు నంబర్ 1 కంపెనీ తనఖా ఉంచిన 15,00,000 షేర్లను రూ.24,67,631/-లకు, తర్వాత మోర్గాన్ వెంచర్స్ లిమిటెడ్ గా నామకరణం చేయబడిన, డూగర్ అండ్ అసోసియేట్స్ లిమిటెడ్ కు అమ్మడం జరిగినది. ఈ కొనుగోలు చేసిన కంపనీకి కూడా, 2 నుండి 4 వ నిందితులు డైరెక్టర్లుగా ఉన్నారన్న విషయం, ప్రముఖంగా (గుర్తించదగినది).

3.10. తేదీ 11.02.2011 న, ఫిర్యాదుదారు/మొదటి ప్రతివాది, విచారణ కోర్టు ముందు 1 నుండి 4 వ నిందితులపై, నేరపూరితంగా మోసము చేయడం మరియు నేరపూరిత విశ్వాస ఉల్లంఘనలను ఆరోపిస్తూ సిసి నెం. 56/ఎస్డబ్ల్యు/2011 తో క్రిమినల్ ఫిర్యాదు దాఖలు

చేయడం జరిగినది. దాని మీదట, భారత శిక్షాస్మృతి, 1860 (సంక్షిప్తంగా, "ఐపిసి") లోని 403, 406, 420 మరియు 120-బి సెక్షన్ల క్రింద శిక్షార్హమైన నేరాలకు గానూ నిందితుల అందరికీ తేదీ 11.09.2012 నాడు ఇచ్చిన ఉత్తర్వు ద్వారా, మేజిస్ట్రేట్ సమనులను జారీ చేయడం జరిగినది.

3.11. ఆ ఉత్తర్వును పునస్సమీక్ష కొరకు బొంబాయిలో ఉన్న గ్రేటర్ బొంబాయి సెషన్ కోర్టు ముందు దాఖలు చేయబడిన క్రిమినల్ రివిజన్ అప్లికేషన్ నెం. 1276/2012, తేదీ 16.01.2016 నాడు జారీ చేయబడిన ఉత్తర్వు ద్వారా ఆమోదించబడి, క్రిమినల్ ప్రొసీజర్ కోడ్, 1973 లోని సెక్షన్ 200 కింద ధృవీకరణను తిరిగి నమోదు చేయవలసిందన్న ఆదేశంతో కేసును విచారణ కోర్టుకు తిరిగి పంపడం జరిగినది.

3.12. ఇంతలోగా, ఫిర్యాదుదారు/మొదటి ప్రతివాది క్లెయిమ్ చేయబడిన రూ. 34,59,218/-లను సంవత్సరానికి 36 శాతం వడ్డీతో సహా చెల్లించవలసినదిగా ఆదేశిస్తూ నిందితుడు నెంబరు 1 కంపెనీకి అనుకూలంగా సం. 2015 డిసెంబర్ 9 వ తేదీన ఆర్బిట్రల్ అవార్డు ఇవ్వడం జరిగినది.

3.13. సం. 2016 జనవరి 16 వ తేదీ నాటి రిమాండ్ ఉత్తర్వు ప్రకారం, సం. 2017 మార్చి 22 వ తేదీన ఐపిసి లోని సెక్షన్ 34 తో కలిపి చదవబడిన సెక్షన్ 406, 420 కింద మరియు సెక్యూరిటీ ఎక్స్ఛేంజ్ మండలి ఆఫ్ ఇండియా చట్టము, 1992 (సంక్షిప్తంగా, "సెబీ

చట్టము") లోని సెక్షన్ 15-హెచ్ఏ క్రింద శిక్షార్హమైన నేరాలకుగానూ 1 నుండి 4 వ నిందితులకు విచారణ కోర్టు సమనులు జారీ చేయడమైనది.

3.14. దానితో వ్యధితులు అయి నిందితులు ముంబైలోని దిండోషి సెషన్స్ కోర్టు ముందు పునస్సమీక్ష దరఖాస్తు No.128/2017 ను దాఖలు చేయగా ఆ కోర్టు 2019 డిసెంబర్ 2 నాటి ఉత్తర్వు ద్వారా ఆ దరఖాస్తును పాక్షికంగా ఆమోదించడం జరిగినది. మొదటి నిందితుడికి సంబంధించిన సమనులు పూర్తిగా రద్దు పరచబడి త్రోసిపుచ్చడమైనది మరియు ఐపిసి సెక్షన్ 420 మరియు సెబి చట్టములోని సెక్షన్ 15-హెచ్ఎ ల కింద శిక్షార్హమైన నేరాలకు సంబంధించి 2 నుంచి 4 వ నిందితులకు ఇవ్వబడిన సమనులు రద్దు చేయబడినవి. కానీ, 2 నుంచి 4 వ నిందితులకు, ఐపిసి సెక్షన్ 34 తో కలిపి చదవబడిన సెక్షన్ 406 కింద శిక్షార్హమైన నేరాలకు, ఇచ్చిన సమనులు మాత్రం ధృవీకరించబడినవి.

3.15. పైన పేర్కొన్న ఉత్తర్వును సవాలు చేస్తూ, ఫిర్యాదుదారుడు/మొదటి ప్రతివాది మరియు 2 నుండి 4 వ నిందితులు/అప్పీలుదారులు క్రిమినల్ రిట్ దరఖాస్తులను దాఖలు చేయడం జరిగింది. తేదీ 26 ఏప్రిల్ 2021 నాటి ప్రస్తుత వివాదాస్పద తీర్పు ద్వారా హైకోర్టు, ఫిర్యాదుదారుడు/మొదటి ప్రతివాది దాఖలు చేసిన క్రిమినల్ రిట్ దరఖాస్తులను ఆమోదిస్తూ 2 నుండి 4 వ నిందితులు దాఖలు చేసిన క్రిమినల్ రిట్ దరఖాస్తులను త్రోసిపుచ్చడం, దానివలన ఐపిసి 34 వ సెక్షన్ తో కలిపి చదవబడిన సెక్షన్ 406 మరియు 420 ల కొరకు విచారణ కోర్టు ఇచ్చిన సమనులను ధృవీకరించడం జరిగినది.

ఫిర్యాదుదారుడు/మొదటి ప్రతివాది తాను దానికి సంబంధించిన దరఖాస్తును కొనసాగించనని హైకోర్టుకు తెలపడం వలన సెబీ చట్టము సెక్షన్ 15-హెచ్ఏ క్రింది నేరారోపణలను ఉపసంహరించడం జరిగినది.

3.16. అందువలన, ప్రస్తుత అప్పీళ్ళు (వచ్చినవి)

4. 2 నుంచి 4 వ నిందితులు/అప్పీలుదారుల తరపున గౌరవ సీనియర్ న్యాయవాదులు శ్రీ శ్యామ్ దివాన్ మరియు శ్రీ వైభవ్ మల్హోత్రా, ఫిర్యాదుదారుడు/మొదటి ప్రతివాది తరపున గౌరవ సీనియర్ న్యాయవాదులు డాక్టర్ అభిషేక్ మను సింఘ్వి మరియు శ్రీమతి అంజనా ప్రకాష్ మరియు రెండవ ప్రతివాది అయిన ప్రభుత్వం తరపున గౌరవ న్యాయవాది శ్రీ సిద్ధార్థ్ ధర్మాధికారి, (వీరందరూ) వినిపించిన వాదనలను వినడం జరిగినది.

5. ఫిర్యాదును, దాని ముఖ విలువతో చూసినప్పటికీ, దానిలో నేరానికి సంబంధించిన ఏ అంశాలు కూడా కనపడటంలేదని శ్రీ దివాన్ వాదించినారు. ఫిర్యాదుదారు/మొదటి ప్రతివాది ఇంటర్-కార్పొరేట్ డిపాజిట్ ఒప్పందం (ఇక నుండి "ఐసిడిఎ" గా పిలవబడుతుంది) తో పాటు, ప్రస్తుత వివాదంలో ఉన్న షేర్లను కూడా తనఖా పెట్టారని, వీరు చెప్పారు. ఎల్ఓపి ప్రకారం, నిందితుడు నంబర్ 1 కంపెనీ, ఏ సమయంలోనైనా ఉపేక్ష ఉన్నా లేకపోయినా కూడా పూచీకత్తును అమలు చేసుకోవచ్చు. ఈ పూచీకత్తులను విక్రయించడానికి, మరియు పరిష్కరించడానికి, ఈ ఎల్ఓపి ద్వారా అధికారం ఇవ్వబడినది. ఎల్ఓపీ ప్రకారమే నిందితుడు నంబర్ 1 కంపెనీ (వీటిని) తనకు తానే అమ్ముకోవచ్చు అని కూడా వీరు చెప్పారు.

6. ఈ వివాదాన్ని గురించే, కక్షిదారుల మధ్య ఆర్బిట్రేషన్ కార్యకలాపాలు కూడా జరిగాయని శ్రీ దివాన్ తెలిపినారు. ఈ ఆర్బిట్రేషన్ కార్యకలాపాలలో ఫిర్యాదుదారుడు/మొదటి ప్రతివాది పాల్గొనడం జరిగిందని, గౌరవ ఆర్బిట్రల్ ట్రిబ్యునల్ ఆర్బిట్రల్ అవార్డ్ ను ఇవ్వడం జరిగినదని, ఫిర్యాదుదారుడు/మొదటి ప్రతివాది దీనిని ఆర్బిట్రేషన్ మరియు కన్సీలియేషన్ చట్టము, 1996 (ఇది ఇక నుండి "ఆర్బిట్రేషన్ చట్టము" గా పిలవబడుతుంది) లోని సెక్షన్ 34 కింద సవాలు చేయడమైనదని కూడా వీరు తెలిపినారు. కక్షిదారుల మధ్య ఉన్న వివాదం పూర్తిగా సివిల్ వివాదం అని, అందువలన ఈ క్రిమినల్ ప్రొసీడింగ్స్ ను కొనసాగించడం కేవలం చట్టాన్ని దుర్వినియోగం చేయడమే అవుతుందని కూడా వీరు వాదించినారు.

7. దీనికి విరుద్ధంగా, ఫిర్యాదుదారు/మొదటి ప్రతివాది తరపున డాక్టర్ సింఘ్వీ ఈ క్రింది విధంగా చెప్పారు: 2000 జూన్ 5 వ తేదీననే ఫిర్యాదుదారు/మొదటి ప్రతివాది నిందితులు/ప్రస్తుత అప్పీలుదారులకు షేర్లను అమ్మమని చెప్పినారు. కానీ నిందితులు/అప్పీలుదారులు షేర్ల మార్కెట్ ధర చాలా ఎక్కువగా ఉన్నప్పుడు వానిని అమ్మదలచలేదు. వారు, 2 మరియు 3 వ నిందితులు డైరెక్టర్లుగా ఉన్న కంపెనీకి, చాలా తక్కువ ధరకు షేర్లను అమ్మడంలోనే వారి యొక్క కపటపు ఉద్దేశ్యం తెలుస్తూ ఉన్నది. నిందితులు/అప్పీలుదారుల యొక్క చట్ట విరుద్ధపు చర్యలను గురించి మొట్టమొదటి సారిగా 2009 వ సంవత్సరంలో ఫిర్యాదుదారు /మొదటి ప్రతివాదికి తెలియడం వలన, ఫిర్యాదు చేయడంలో ఆలస్యం జరగలేదు. ఏది ఏమైనా, విచారణ కోర్టు, పునస్సమీక్ష చేసిన కోర్టు మరియు హైకోర్టు కూడా ఐపిసిలోని సెక్షన్ 406 కింద శిక్షార్హమైన నేరం చేసినట్లుగా తెలియడం

గురించి ఏక నిర్ణయాన్ని వెలిబుచ్చడం జరిగినది. అందువలన వాస్తవాలను గురించిన ఈ ఏక నిర్ణయంలో జోక్యం కలుగజేసుకోవడం అంగీకారయోగ్యం కాదు. అందువలన, ఫిర్యాదును త్రోసిపుచ్చవలయును.

8. కక్షిదారుల తరపు గౌరవ న్యాయవాదుల సహాయంతో, రికార్డులో ఉంచబడిన పత్రాలను పరిశీలించడమైనది.

9. ఎం/ఎస్ గణేష్ బెంజోప్లాస్ట్ లిమిటెడ్ అంటే ఫిర్యాదుదారుడు/ప్రస్తుత మొదటి ప్రతివాది మరియు ఎం/ఎస్ మోర్గాన్ సెక్యూరిటీస్ & క్రెడిట్స్ ప్రైవేట్ లిమిటెడ్, అంటే నిందితుడు నెంబరు 1 కంపెనీల మధ్య సం. 2000 మార్చి 7 వ తేదీన ప్రస్తుత వివాదంలో ఉన్న ఐ. సి. డి. ఎ. ఖరారు కావడం గురించి వివాదం లేదు. ఈ ఐసిడిఎ లో, నిందితుడు నంబర్ 1 కంపెనీ ఫిర్యాదుదారుడు/మొదటి ప్రతివాదికి 90 రోజుల వ్యవధి గల రూ. 50,00,000/- ల ఐసిడి ని సంవత్సరానికి 26 శాతం వడ్డీ క్రింద ఇవ్వడానికి ఒప్పుకున్నది. ఈ సందర్భంగా ఐ. సి. డి. ఎ. లోని 2 మరియు 3 వ అంశములలోని వివరాలు ఈ క్రింద చెప్పబడుతున్నాయి:

> *"2. మంజూరు షరతుల ప్రకారం పూచీకత్తు ఇచ్చే ఒప్పందం పైనే రుణదాత ఐ. సి. డి ఇస్తున్నారనే విషయం బాకీదారునకు తెలుసు.*
>
> *3. ఐసిడి మరియు ఇతర విధమైన బకాయిలు చెల్లించే వరకు రుణదాతకు అనుకూలంగా ధారణ హక్కును నమోదు చేయాలని, రద్దు చేయలేని విధంగా డీమెటీరియలైజ్డ్ పార్టిసిపెంట్ (బ్రోకరేజ్ సంస్థ) కు, రద్దు చేయని విధంగా*

సూచన ఇవ్వాలనే విషయంలో బాకీదారు ఉపసంహరణకు వీలు లేకుండా ఒప్పుకోవడం జరిగినది. షేర్ల యొక్క డీమెటీరియలైజింగ్ కొరకు అయ్యే ఖర్చునన్నింటినీ బాకీదారే భరించాలి."

10. మంజూరు షరతుల ప్రకారం పూచీకత్తును ఇచ్చే ప్రాతిపదికన రుణదాత ఐసిడిని మంజూరు చేశారన్న విషయాన్ని గమనించవచ్చు. ఐసిడి మరియు ఇతర విధమైన బకాయిలు చెల్లించే వరకు రుణదాతకు అనుకూలంగా ధారణ హక్కును నమోదు చేయాలని రద్దు చేయలేని విధంగా డీమెటీరియలైజ్డ్ పార్టిసిపెంట్ (బ్రోకరేజ్ సంస్థ) కు రద్దు చేయని విధంగా సూచన ఇవ్వడానికి, ఉపసంహరించుకోలేని విధంగా ఫిర్యాదుదారుడు/మొదటి ప్రతివాది అంగీకరించారు. ఐ. సి. డి. ఎ. లోని 9వ అంశంలో ఈ క్రింది చెప్పబడిన భాగాన్ని నిర్దేశించడం ఇక్కడ సందర్భోచితం:

"9. .....

ఎ) పైన అంగీకరించిన విధంగా విడతలలో చెల్లించాల్సిన వడ్డీలో ఏ విడతనైనా గడువు తేదీ నుండి 3 రోజులు ముగిసిన తర్వాత కూడా చెల్లించని యెడల.

బి) సౌకర్యం అందించడానికి షరతుగా ఇచ్చిన పూచీకత్తు పత్రం ద్వారా సమకూర్చిన పూచీకత్తులో ఏదైనా లోపం ఏర్పడినప్పుడు అందులో చెప్పబడిన విధంగా తగిన నోటీసు ఇచ్చినప్పటికీ, దానిని (ఆ లోపాన్ని) భర్తీ చేయనప్పుడు.

సి).....

డి).....

ఇ).....

ఎఫ్).....

హెచ్).....

ఐ)....."

11. ఇందువలన, ఐ. సి. డి. ఎ. లోని 9 వ క్లాజ్ లోని సబ్ క్లాజులు (ఎ) నుండి (ఐ) లలో చెప్పబడిన ఏ సంఘటన అయినా జరిగినప్పుడు, ఐ. సి. డి. ఎ. లో చెప్పబడిన విధంగా , డీడ్ ఆఫ్ పర్సనల్ గారంటీ (వ్యక్తిగత హామీ పత్రాలు), కార్పొరేట్ హామీ మరియు ఎల్. ఓ. పి. ల ద్వారా, తనకు సంక్రమించిన హక్కులను అమలు చేసుకునే విచక్షణాధికారం రుణదాతకు ఉంటుందని స్పష్టమౌతున్నది. ఐ. సి. డి. ఎ. ప్రకారం చెల్లించాల్సిన ఏ విడత వడ్డీ అయినా గడువు తేదీ దాటిన తర్వాత 3 రోజులు పూర్తైనా, చెల్లింపబడనట్లైతే ఐ. సి. డి. ఎ. లోని 9 వ క్లాజ్ లోని సబ్ క్లాజ్ (ఎ) ప్రకారం నిందితుడు నెంబర్ 1 కంపనీ ఐ. సి. డి. ఎ. లోని 9 వ క్లాజ్ లో ఉటంకించబడిన హక్కులను అమలు చేసుకోవడానికి హక్కు కలిగి ఉంటుంది. అదే విధంగా ఎల్. ఓ. పి. ని ఇచ్చేటప్పుడు, సౌకర్యం కల్పించడానికి ఇచ్చిన పూచీకత్తులో ఏదైనా లోపం ఏర్పడినప్పుడు, తగు నోటీసు ఇచ్చినప్పటికీ, ఆ లోపాన్ని భర్తీ చేయనప్పుడు నిందితుడు నంబర్ 1 కంపెనీ ఐ. సి. డి. ఎ. లోని 9 వ క్లాజ్ యొక్క సహాయాన్ని తీసుకోవడానికి హక్కు కలిగి ఉంటాడు.

12. ఈ క్రింద చెప్పబడిన ఎల్. ఓ. పి లోని 5 మరియు 8 (5) క్లాజులను ఉటంకించుట కూడా ఇక్కడ సందర్భోచితం:

“5. ఎప్పుడైనా ఉపేక్ష వలన లేక ఇతర విషయాల వలన కానీ పూచీకత్తుదారుడు/రుణదాత యొక్క ఏకైక విచక్షణకు సరియైనదిగా తోచినన్ని సంఖ్య గల షేర్ల గురించిన పూచీకత్తును పూచీకత్తుదారు అమలు చేసుకోవచ్చును. కానీ, ఆ విధమైన పూచీకత్తు యొక్క అమలు రుణదాతకు షేర్లను అమ్మినట్లుగా కాదు. మరియు రుణగ్రహీత, ఆ తేదీన రుణదాతల ఖాతాకు వాటాలను బదిలీ చేయడంపై, ఎటువంటి జమ లేక సర్దుబాటుకు అర్హులు కాదు. మార్కెట్ లో రుణదాత షేర్లను వాస్తవంగా అమ్మినప్పుడు, వసూలైన మొత్తానికి సంబంధించి మాత్రమే ఐ. సి. డి. బకాయిలకు ఆ అమ్మకపు రాబడిని సర్దుబాటు చేయమనడానికి రుణగ్రహీతకు హక్కు ఉంటుంది. ఈ విషయాన్ని అర్థం చేసుకున్నట్లుగా ఒప్పుకున్న తర్వాత, తాకట్టు పెట్టిన వ్యక్తి, దీనిని గురించి వివాదాన్ని లేవనెత్తడానికి వీలు లేదు.

8. .....

i). .....
ii). .....
iii). .....
iv). .....

v) *పైన చెప్పిన క్లాజ్ 7 లో ఉటంకించిన పరిస్థితులలో పూచీకత్తులను అమ్మడానికి లేక పరిష్కరించుకోవడానికి మీకు వీలు కలిగించేందుకు గానూ మీకు బాకీ ఉన్న సొమ్ముకు ఆ షేర్లను జమ చేసుకోవడానికి అవసరమైన అన్ని పనులు మరియు చర్యలను తీసుకోవడానికి మీకు అధికారం ఇవ్వడమైనది. రుణదాత తనకు గానీ, తన సమూహంలోని కంపెనీలకు కానీ లేక బయటి*

వ్యక్తులకు ఎవరికైనా కానీ ఈ పూచీకత్తులను అమ్మినప్పుడు, ధర విషయంగా వచ్చిన ఏ విధమైన నష్టాన్ని గురించి, ఏ విధమైన వివాదాన్ని కానీ, క్లెయిమ్ ను కానీ చేయమని, మేము ఇందుమూలంగా స్పష్టం చేస్తున్నాము."

13. ఎల్. ఓ. పి. లోని 5 వ క్లాజ్ ను చూసినప్పుడు, ఎప్పుడైనా ఉపేక్ష వలన లేక ఇతర విషయాల వలన కానీ పూచీకత్తుదారుడు/రుణదాత యొక్క ఏకైక విచక్షణకు సరియైనదిగా తోచినన్ని సంఖ్య గల షేర్ల గురించిన పూచీకత్తును, పూచీకత్తుదారు అమలు చేసుకోవచ్చు, అని తెలుస్తున్నది. ఇంకా ఈ విధమైన పూచీకత్తు యొక్క అమలు రుణదాతకు షేర్లను అమ్మినట్లుగా కాదని మరియు రుణగ్రహీత ఆ తేదీన రుణదాత ఖాతాకు షేర్లను బదిలీ చేయడంపై ఎటువంటి క్రెడిట్/సర్దుబాటుకు అర్హులు కాదని కూడా, ఇక్కడ చెప్పబడి ఉన్నది. మార్కెట్ లో రుణదాత షేర్లను వాస్తవంగా అమ్మినప్పుడు వసూలైన మొత్తానికి సంబంధించి మాత్రమే ఐ. సి. డి. బకాయిలకు ఆ అమ్మకపు రాబడిని సర్దుబాటు చేయమనడానికి రుణగ్రహీతకు హక్కు ఉంటుంది. ఈ విషయాన్ని అర్థం చేసుకున్నట్టుగా ఒప్పుకున్న తర్వాత, తాకట్టు పెట్టిన వ్యక్తి దీనిని గురించి వివాదాన్ని లేవనెత్తడానికి వీలు లేదు, అని కూడా ఇక్కడ చెప్పబడి ఉన్నది.

14. ఎల్ఓపీలోని క్లాజ్ 8 లోని సబ్ క్లాజ్ (V) ను పరిశీలిస్తే, ఎల్ఓపీలో పేర్కొన్న పరిస్థితులలో ఆ పూచీకత్తులను విక్రయించడానికి మరియు పరిష్కరించడానికి పూచీకత్తు ఇచ్చిన వ్యక్తి ఒక నిర్దిష్ట అధికారాన్ని ఇచ్చినట్లు తెలుస్తుంది. ఫిర్యాదుదారు/ప్రతివాది నెం. 1 కూడా బకాయి మొత్తాన్ని సర్దుబాటు చేయడానికి ఆ షేర్లను పరిష్కరించడానికి కావాలసిన అన్ని పనులు మరియు చర్యలను చేపట్టడానికి అంగీకరించారు. నిందితుడు నంబర్ 1 కంపెనీ పూచీకత్తులకు

ఉత్తమ ధర పొందిందా అన్న విషయము (గురించి) ప్రశ్నించనని, ఫిర్యాదుదారు/ప్రతివాది నంబర్ 1 అంగీకరించినారు.

15. ఐసిడిఎ మరియు ఎల్ఓపి నిబంధనలను పరిశీలిస్తే, ఐసిడిఎ యొక్క క్లాజ్ 9 లో పేర్కొన్న విధంగా ఏదైనా సంఘటనలు జరిగిన సందర్భంలో, నిందితుడు నంబర్ 1 కంపెనీకి తనకు తాను గానీ, తన దాని గ్రూప్ కంపెనీలకు లేదా బయటి వ్యక్తులకు గానీ, షేర్లను విక్రయించే హక్కు ఉందని స్పష్టంగా తెలుస్తుంది. ఆ విధంగా సెక్యూరిటీలను విక్రయించిన ధర కారణంగా (కలిగిన) ఎటువంటి నష్టాన్ని (గురించి) వివాదం చేయకూడదని లేదా క్లెయిమ్ చేయకూడదని, నిందితుడు నంబర్ 1 కంపెనీ కూడా అంగీకరించింది.

16. మొత్తం ఫిర్యాదును పరిశీలిస్తే మార్కెట్ ధర పడిపోయి ఉన్నప్పుడు, నిందితుడు నంబర్ 1 కంపెనీ షేర్లను తనకు తాను విక్రయించుకున్నారని మాత్రమే ఆరోపణ ఉన్నదని తెలుస్తున్నది. ఆరోపణ ఏమిటంటే : "ఫిర్యాదుదారుని యొక్క మరిన్ని షేర్లను పొందటం కోసం నిందితులు, షేర్ ధర మరింత పడిపోవడానికి వేచి ఉండి, సం. 2001 లో మాత్రమే వాటిని రూ. 24,67,531 లకు అమ్మడం జరిగింది. అందువల్ల నిందితులు సంయుక్తంగా మరియు విడిగా, అనధికారిక, చట్టవిరుద్ధమైన మరియు మోసపూరిత అమ్మకాలకు మరియు విశ్వాస ఉల్లంఘనకు కూడా బాధ్యత వహించవలసి ఉంటుంది. నిందితులు షేర్లను దుర్వినియోగం చేయడమే కాకుండా, ఫిర్యాదుదారుని మోసం చేశారు, ఎందుకంటే పూచీకత్తుగా ఇచ్చిన షేర్లతో

సెబి మార్గదర్శకాల ప్రకారం వ్యవహరిస్తామని నిందితుడు ఇచ్చిన హామీపై మాత్రమే నిందితులకి (వానిని) అప్పగించడం జరిగినది. కానీ తర్వాత ఇది అబద్ధమని నిరూపించబడింది.

17. పైన పేర్కొన్న వాదనలు ఐసిడిఎతో పాటు ఎల్ఓపిలో కక్షిదారుల మధ్య అంగీకరించబడిన నిబంధనలకు పూర్తి విరుద్ధంగా ఉన్నాయి. పైన చర్చించినట్లుగా, ఐసిడిఎ మరియు ఎల్ఓపి ప్రత్యేకంగా నిందితులు/అప్పీలుదారులకు తమకు తాము గానీ లేదా తమ కంపెనీల సమూహానికి షేర్లను విక్రయించడానికి అధికారం ఇస్తున్నాయి. నిందితుడు నెం.1 కంపెనీ ఇప్పటికే తేదీ 14 ఆగస్టు, 2001 న ఆర్బిట్రేషన్ నిబంధనను అమలు చేసిందని గమనించాలి. ఆర్బిట్రేషన్ కార్యకలాపాలలో, నిందితుడు నెం.1 కంపెనీ మొదటి ఉపేక్ష సమయంలోనే, 2000 సంవత్సరం మే నెలలోనే పూచీకత్తును అమలు చేసి ఉండాలని, ఫిర్యాదుదారు/ మొదటి ప్రతివాది ఒక నిర్దిష్ట వైఖరిని తీసుకున్నారు. కానీ నిందితులు/అప్పీలుదారులు పూచీకత్తుగా ఇచ్చిన షేర్లను విక్రయించడానికి 2001 వ సంవత్సరం ఆగస్టు-సెప్టెంబర్ వరకు వేచి ఉన్నారు. ఇంతలో వాని విలువ క్షీణించినది. నిందితుడు నంబర్ 1 కంపెనీ షేర్ల ధరను తారుమారు చేసినాడు అన్నది, ఆర్బిట్రేషన్ కార్యకలాపాల సమయంలో, చేసిన మరొక ఆరోపణ. గౌరవ ఆర్బిట్రేటర్ రూపొందించిన అంశం నెం.2 ను ఇక్కడ చెప్పడం సందర్భోచితం, అది ఈ విధంగా ఉన్నది.

> *"2) తాకట్టు పెట్టిన 15 లక్షల ఈక్విటీ షేర్లను అమ్మడం జరిగినదా? అలా జరిగితే, ఎప్పుడు, ఏ ధరకు, ఎవరికి మరియు ఏ విధముగా?(ఒపిపి). (ఈ అంశంలో క్లైమెంట్ షేర్లను అందుబాటులో వున్న ఉత్తమైన ధరకు అమ్మలేదన్న వాదన కూడా*

ఉన్నది. 2000, మే 3 వ తేదీ నాటి లేఖలో పేర్కొన్న విధంగా షేర్లను విక్రయించడానికి క్లైమెంట్లు బాధ్యత వహించారా అన్న ఆరోపణ కూడా ఇందులో ఉన్నది).”

18. తేదీ 09.12.2005 నాటి తన అవార్డులో, గౌరవ ఆర్బిట్రేటర్ చేసిన ఈ క్రింది పరిశీలనలను ఇక్కడ చెప్పడం సందర్భోచితము:

“32. ఒకటవ ప్రతివాది సొంత నిర్ధారణ (పైన చెప్పిన పేరా-బి లో పేర్కొన్న తేదీ లేని వ్రాతపూర్వక నోట్ లో చెప్పిన విధముగా) ప్రకారం, తేదీ 24.03.2001 న క్లైమెంటుచే అమ్మబడిన పూచీకత్తు పై ఇవ్వబడిన షేర్ల సగటు ధర ప్రతి ఈక్విటీ షేరుకు రూ. 2.47 గా అవుతుందన్నది గమనించదగ్గ విషయం. పైన చెప్పిన విధముగా తేదీ 02.08.2001 నాటికి ఒక్కొక్క షేరుకు సగటు మార్కెట్ ధర 2.95 రూపాయలు అన్న విషయంలో వివాదం లేదు. షేర్ల ధరలలో ఆ విధమైన స్వల్ప హెచ్చుతగ్గులు; మరియు అది కూడా మొదటి ప్రతివాది అలవాటుపడిన ఉపేక్షకుడు అయిన నేపథ్యంలో; షేర్లను తీసుకోవడానికి ఎక్కువ మంది లేనప్పుడు; ధరల తారుమారు ఫలితంగా ప్రతివాదులకు నష్టం వాటిల్లినదని అనలేము.

33. 2001 వ సంవత్సరం ఆగస్టులో ఒక్కొక్క షేరు ధర రూ. 8 లేదా రూ. 10 గా ఉంటే; అప్పుడు క్లైమెంటు యొక్క అమ్మకం రూ. 2/- ప్రాంతంలో ఉండి ఉంటే అది ధరల తారుమారు అన్న ఆరోపణలకు తావు ఇచ్చిఉండేది, కానీ ప్రస్తుత ఉన్న

పరిస్థితులలో మరియు పైన చెప్పిన కారణాల వల్ల మొదటి ప్రతివాది చేసిన ఆరోపణలు సరైనవి కావు, అందువలన అవి తిరస్కరింపబడవలెను"

19. 2001 వ సంవత్సరంలోనే, ఆర్బిట్రేషన్ కార్యకలాపాలు మొదలైనప్పటికే ఫిర్యాదుదారు/మొదటి ప్రతివాదికి షేర్ల అమ్మకం గురించి తెలుసునన్నది స్పష్టం అవుతున్నది. ఆర్బిట్రేషన్ కార్యకలాపాల సమయంలో, నిందితులు/అప్పీలుదారులు చేసిన చట్ట విరుద్ధమైన (చర్యల) గురించి ఫిర్యాదుదారు/ప్రతివాది నెం.1 అనుమానం వ్యక్తం చేసి కొంత సమాచారం కోరినట్లుగా ఆరోపించబడినది. అయితే, నిందితులు/అప్పీలుదారులు సమాచారం ఇవ్వనందున, ఫిర్యాదుదారు/మొదటి ప్రతివాది 2006 వ సంవత్సరంలో బాంబే స్టాక్ ఎక్స్ఛేంజి (సంక్షిప్తముగా, "బిఎస్ఇ") మరియు నేషనల్ స్టాక్ ఎక్స్ఛేంజి (సంక్షిప్తముగా, "ఎన్ఎస్ఇ") ల నుండి తేదీలు. 24 ఆగస్టు 2001, 31 ఆగస్టు 2001, 3 సెప్టెంబర్ 2001 మరియు 12 సెప్టెంబర్ 2001 న నిందితులు/అప్పీలుదారులు అమ్మిన షేర్ల వివరాలను కోరడం జరిగినది. ఆ తరువాతనే, షేర్ మార్కెట్ ముగింపు సమయంలో మరియు ఆ రోజులో అతి తక్కువ ధరకు, షేర్లను అమ్మినట్లుగా ఫిర్యాదుదారు/మొదటి ప్రతివాది 2006 వ సంవత్సరములో తెలుసుకున్నట్లుగా ఫిర్యాదులో చెప్పబడియున్నది. ఆ సమయములోనే నిందితులు/అప్పీలుదారులు షేర్లను తమ సొంత కంపెనీలకే అమ్ముకున్నట్లుగా కూడా ఫిర్యాదుదారు/మొదటి ప్రతివాది తెలుసుకున్నట్లుగా కూడా చెప్పబడియున్నది.

20. 2001 వ సంవత్సరంలోనే ఫిర్యాదుదారు/మొదటి ప్రతివాది షేర్ల అమ్మకం గురించి తెలిసి ఉండి (దాని) వివరాల కోసం 2006 వ సంవత్సరంలో "బిఎస్ఇ" మరియు "ఎన్ఎస్ఇ" కు దరఖాస్తు చేసే వరకు, అతడు ఏ చర్య తీసుకోలేదన్న విషయము ఇందు మూలంగా తెలుస్తువున్నది. 2006 వ సంవత్సరం తర్వాత కూడా ఫిర్యాదుదారు/మొదటి ప్రతివాది ఫిర్యాదు చేయడానికి 2011 వ సంవత్సరం వరకు వేచి చూశారు. నిందితులు/అప్పీలుదారుల యొక్క మోసపూరితమైన చర్యల గురించి ఫిర్యాదుదారుడు/మొదటి ప్రతివాది 2009 వ సంవత్సరంలో తెలుసుకున్నారని దాని మీదనే ఫిర్యాదు చేయడానికి కారణం ఏర్పడినదని ఆతడు మా ముందు చెప్పడానికి ప్రయత్నించినాడు కానీ ఆ విధమైన ఉక్తులు ఫిర్యాదులో లేవు.

21. మార్కెట్ ధర కంటే తక్కువ ధరకు షేర్లను విక్రయించినారనే మరియొక వాదనకు సంబంధించిన ఉక్తులు కూడా ఫిర్యాదులో లేవు. ఏదేమైనా, ఈ లావాదేవీలు "బిఎస్ఇ" మరియు "ఎన్ఎస్ఇ" ద్వారా జరపబడినవి. అందువల్ల, ఈ వాదనలో ఏమి పసలేదు. ఏదేమైనా, ఇందుకు సంబంధించి గౌరవ ఆర్బిట్రేటర్ నిర్దిష్టమైన నిర్ధారణను ఇచ్చారు. ఇంతకు ముందుగా తెలిపినట్లుగా ఆ ఆర్బిట్రల్ అవార్డును మధ్యవర్తిత్వము చట్టము (Arbitration Act)యొక్క సెక్షన్ 34 కింద సవాలు చేసి ఉన్నారు, సమర్థ కోర్టు యొక్క పరిశీలనలో ఈ అవార్డు ఉన్నందున దాని యోగ్యతాయోగ్యతల గురించి పరిశీలించడానికి మేము ఇష్టపడము.

22. పూర్తిగా ఒక ఒప్పంద వివాదమైనదాన్ని క్రిమినల్ కేసుగా మార్చడానికి ఫిర్యాదుదారు/మొదటి ప్రతివాది ప్రయత్నించారని స్పష్టం అవుతున్నది. అదేకాక, ఫిర్యాదు

చేయడంలో విపరీతమైన జాప్యం జరిగినది. 2001 వ సంవత్సరంలోనే ఫిర్యాదుదారు/మొదటి ప్రతివాదికి షేర్ల అమ్మకం గురించి తెలిసియున్నా, గౌరవ ఆర్బిట్రేటర్ ముందు ఒక దరఖాస్తును ఇవ్వడం తప్ప ఇంకేమియు చేయలేదు. ఫిర్యాదుదారు/మొదటి ప్రతివాది ప్రకారం, 2006 వ సంవత్సరములో బిఎస్ఇ మరియు ఎన్ఎస్ఇ నుండి అతను పొందిన సమాచారం, మోసం జరిగిందన్న అతని అనుమానాన్ని దృవపరచినది. కానీ ఆ తరువాత కూడా ఐదు సంవత్సరముల పాటు, మౌనముగా ఉండి, కేవలం 2011 సంవత్సరంలో ఫిర్యాదు చేయడం జరిగినది. ఇంతకు ముందు చెప్పినట్లుగా, జరిగిన మోసం గురించి 2009 వ సంవత్సరములో తెలుసుకున్న తరువాతే, ఫిర్యాదు ఇవ్వడం జరిగిందని చెప్పడానికి ప్రయత్నం జరిగింది కానీ, ఈవిధమైన ఉక్తులేవీ, ఫిర్యాదులో లేవు.

23. ఫిర్యాదును, దాని ముఖ విలువ ప్రకారం చూసినప్పుడు, అది ఆరోపింపబడిన నేరమును గురించిన అంశాలు వేటిని తెలుపడంలేదు. ఈ మొత్తము పరిస్థితులన్నిటినీ పరిగణించినప్పుడు ఈ ఫిర్యాదు చట్ట ప్రక్రియ దుర్వినియోగము తప్ప మరొకటి కాదని మేము గమనించడం జరిగినది, అందువల్ల ఈ అప్పీళ్లు ఆమోదించదగినదిగా మేము భావిస్తున్నాము.

24. ఫలితంగా, మేము ఈ క్రింది ఉత్తర్వును ఇవ్వడం జరిగినది.

(i) అప్పీళ్లు ఆమోదింపబడినవి;

(ii) 26, ఏప్రిల్ 2021 నాడు హైకోర్టు జారీ చేసిన వివాదాస్పద తీర్పు మరియు 22, మార్చి 2017 నాడు విచారణ కోర్టు ఇచ్చిన ఉత్తర్వులను, రద్దు చేయడం మరియు త్రోసిపుచ్చడము అయినది.

(iii) ఐపిసిలోని 403, 406, 420 మరియు 120 బి సెక్షన్ల కింద విచారణ కోర్టు ముందు దాఖలు చేసిన, సిసి నెం.56/SW/2011 కలిగిన, ఫిర్యాదును కొట్టివేయడమైనది.

25. ఏదేమైనా, ఇందులో కానీ ఇక్కడ వివాదాస్పదమైన ఉత్తర్వులలో కానీ చేసిన పరిశీలనలకు, ఆర్బిట్రేషన్ చట్టము సెక్షన్ 34 కింద ఆర్బిట్రల్ అవార్డును పరిశీలనలోకి తీసుకున్న కార్యస్థానము(ఫోరమ్) ముందు ఉన్న కార్యకలాపాలలో కానీ, అప్పీలుదారులు తీసుకున్న ఇంకేవిధమైన మార్గాలకు సంబంధించిన కార్యకలాపాలలో కానీ, ఏవిధమైన ప్రాధాన్యత ఇవ్వబడకూడదని, మేము స్పష్టం చేస్తున్నాము.

26. పెండింగ్ లో ఉన్న దరఖాస్తులు ఏవైనా ఉంటే అవి అన్నీ పరిష్కరింపబడినట్లే.

.....న్యాయమూర్తి

[బి. ఆర్. గవాయి]

..... న్యాయమూర్తి

[విక్రమ్ నాథ్]

న్యూ ఢిల్లీ;

28, ఏప్రిల్ **2023.**